# పనుల్లో జాప్యం సహించం



ప్రజాప్రతినిధులు, నాయకులకు సూచనలిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

- పెండింగ్‌లో ఉంటే త్వరగా పూర్తి చేయించాలి
- స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి సమీక్ష

బాన్సువాడ టౌన్, జూలై 19 : ప్రజల కష్టాలు తీర్చడంతోపాటు మెరుగైన వసతులను కల్పించేందుకు చేపడుతున్న అభివృద్ధి పనుల్లో జాప్యం చేస్తే ఎంతమాత్రం సహించేది లేదని శాసన సభాపతి స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. బాన్సువాడ నియోజకవర్గం పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై తన స్వగృహంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. పనుల పురోగతి గురించి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్లక్ష్యం వహించకుండా పెండింగ్ పనులను త్వరగా పూర్తిచేయించాలని స్పీకర్ ఆదేశించారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో వందల కోట్ల రూపాయలను బాన్సువాడ నియోజకవర్గ అభివృద్ధి కోసం వెచ్చిస్తున్నామని తెలిపారు. ప్రతిసారీ అడిగిన వెంటనే నిధులు ఇస్తున్న కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. టెండర్ ప్రక్రియ పూర్తయిన పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. సెప్టెంబర్ వరకు పూర్తి చేయకపోతే ఆ నిధులను వేరే పనులకు కేటాయిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ నిధులతో చేపట్టే పనుల్లో తప్పనిసరిగా నాణ్యతా ప్రమాణాలను పాటించి సకాలంలో పూర్తి చేయాలన్నారు. నియోజకవర్గంలో సీఎం కేసీఆర్ సర్కారు చేపడుతున్న అభివృద్ధి పనుల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు ఏ విధంగా లబ్ధిపొందుతున్నారో అందరికీ వివరించాలన్నారు.

**ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉండండి..**

వర్షాలు అధికంగా కురుస్తున్న నేపథ్యంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రమాదాలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. పాత ఇండ్లు ఉంటే వెంటనే ఖాళీ చేయించాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేస్తేనే ప్రజలకు పూర్తి స్థాయిలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి దరిచేరుతుందని తెలిపారు. సమీక్షా సమావేశంలో రైతుబంధు సమితి కామారెడ్డి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి, బాన్సువాడ ఎంపీపీ దొడ్ల నీరజా వెంకట్‌రాం రెడ్డి, బాన్సువాడ ఈఈ సమత, ఆత్మ కమిటీ చైర్మన్ మోహన్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ సంగ్రాం నాయక్, బుడ్మి సొసైటీ చైర్మన్ గంగారాం, సీనియర్ నాయకులు గోపాల్ రెడ్డి, పిట్ల శ్రీధర్, ఏఈ గోపి, నియోజకవర్గ పరిధిలోని ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# ఆపద్బాంధవుడు..

- పేద కుటుంబాలకు అండగా నిలిచిన మంత్రి ప్రశాంత్‌రెడ్డి
- బాధితుల చికిత్స కోసం రూ.5.50 లక్షల విలువైన ఎల్వోసీల అందజేత
- నేనున్నానంటూ ధైర్యం చెప్పిన వేముల

భీమ్‌గల్/మోర్తాడ్, జూలై 19 : అభాగ్యులు, ఆపదలో ఉన్నవారికి రాష్ట్ర రోడ్లు-భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అండగా నిలుస్తున్నారు. బాల్కొండ నియోజకవర్గంలోని అనేక మంది బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థికసాయాన్ని మంజూరు చేయించి ఆపద్బాంధవుడిలా ఆదుకుంటున్నారు. నేనున్నానంటూ భరోసా కల్పిస్తున్నారు. తాజాగా వివిధ కారణాలతో దవాఖానలో చికిత్స చేయించుకుంటున్న ముగ్గురికి మంత్రి బాసటగా నిలిచారు. మెరుగైన చికిత్స కోసం మొత్తం రూ.5లక్షల 50వేల విలువైన ఎల్వోసీలను బుధవారం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో అందజేసి ధైర్యం చెప్పారు. కష్టాల్లో ఉన్న తమను దేవుడిలా ఆదుకున్న మంత్రికి బాధిత కుటుంబసభ్యులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి ప్రశాంత్‌రెడ్డితోపాటు కేసీఆర్ ప్రభుత్వానికి జీవితాంతం రుణపడి ఉంటామన్నారు.

భీమ్‌గల్ పట్టణానికి చెందిన ఎస్.శంకర్ రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. బ్రెయిన్‌కు సంబంధించిన చికిత్స చేయాల్సి ఉందని వైద్యులు చెప్పడంతో స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో బాధితులు మంత్రి ప్రశాంత్‌రెడ్డిని ఆశ్రయించారు. ఆయన వెంటనే స్పందించి శంకర్ చికిత్స కోసం రూ. 2లక్షల 50వేల ఎల్వోసీ మంజూరు చేయించారు. ఆర్థికసాయం కాపీని బుధవారం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. భీమ్‌గల్ మండలం పురాణీపేటకు చెందిన బి.రామకృష్ణ, మోర్తాడ్ మండల కేంద్రానికి చెందిన వై.గంగాధర్ గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న విషయాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు మంత్రి వేముల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి.. వెంటనే ఒక్కక్కరికి రూ.లక్షా 50వేల చొప్పున ఎల్వోసీని మంజూరు చేయించి అందించారు.



భీమ్‌గల్‌కు చెందిన శంకర్ కుటుంబ సభ్యులకు రూ. 2.50లక్షల ఎల్వోసీని అందజేస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

**బోధన్ ఎమ్మెల్యే** మహ్మద్ షకీల్ బుధవారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో కలిశారు. నియోజకవర్గంలోని పలు సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు. అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కవితను కోరారు.

-బోధన్, జూలై 19





**హైదరాబాద్‌లోని** కొత్త సచివాలయంలో కొనసాగుతున్న మసీదు నిర్మాణ పనులను బోధన్ ఎమ్మెల్యే షకీల్, ఉమ్మడి జిల్లా నాయకులు ముజీబుద్దీన్, తారీఖ్ అన్సారీ బుధవారం రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీతో కలిసి పరిశీలించారు. మసీదు నిర్మాణం పూర్తికావడంపై హర్షం వ్యక్తంచేశారు. ప్రార్థనా మందిరాన్ని సీఎం కేసీఆర్ ఆగస్టు 25న ప్రారంభిస్తారని వారు వెల్లడించారు.

# కాంగ్రెస్‌కు ప్రజలు కుర్రుకాల్చి వాత పెడ్తారు

- మీ కపట నాటకాలను రైతులు గమనిస్తున్నారు
- సీఎం కేసీఆర్ హయాలో అన్ని వర్గాలూ సుభిక్షం..
- అందుకే కాంగ్రెస్ రేవంత్‌కు కడుపుమంట
- ఎవరెన్ని చెప్పినా మళ్లీ కేసీఆర్ ప్రభుత్వమే వస్తుంది
- ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్

ఖలీల్‌వాడి, జూలై 19: కాంగ్రెస్‌కు ప్రజలు కర్రుకాల్చి వాత పెడ్తారని, ఆ పార్టీ కపట నాటకాలను అందరూ గమనిస్తున్నారని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. రైతాంగంపై పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మండిపడుతూ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేసీఆర్ తొమ్మిదేండ్ల పాలనలో అన్ని వర్గాలూ సుభిక్షంగా ఉన్నాయని, వరుణుడు కూడా కరుణిస్తున్నాడని పేర్కొన్నారు. రైతు సంక్షేమంలో దేశంలోని ఏ ముఖ్యమంత్రీ.. కేసీఆర్‌కు సాటిరారని అభిప్రాయపడ్డారు. పెట్టుబడి సాయం, 24 గంటల ఉచిత కరెంటు ఇవ్వడంతో రైతులు వ్యవసాయాన్ని పండుగలా చేసుకుంటున్నారని తెలిపారు. రైతులు సంతోషంగా ఉండడాన్ని రేవంత్ రెడ్డి జీర్ణించుకోలేక, కడుపుమంటతో మభ్యపెట్టే మాటలు చెబుతున్నాడని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులు రైతాంగం ఆగ్రహాన్ని త్వరలోనే రుచిచూస్తారని పేర్కొన్నారు. రేవంత్ పూటకో తీరు మాట్లాడుతూ జోకర్‌లా ప్రవర్తిస్తున్నాడని, ఎన్ని కోతి వేషాలేసినా ప్రజలు నమ్మబోరని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో రైతుల దుస్థితిని ఓసారి చూసి మాట్లడాలని రేవంత్‌కు హితవు పలికారు. అక్కడ సంక్షేమ పథకాలు లేక అన్నదాతలు కూలీలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రైతులకు ఎప్పుడు ఏంకావాలో సీఎం కేసీఆర్ తెలుసుకొని సకాలంలో అందిస్తున్నారని తెలిపారు. రైతు రాజుగా మారుతుండడాన్ని చూసి కాంగ్రెస్‌కు మైండ్ బ్లాంక్ అయ్యిందని పేర్కొన్నారు. రైతుల నోట్లో మట్టికొట్టే ప్రయత్నాలతో మరింత పలుచనవుతున్నారని తెలిపారు. ఎవరెన్ని మాటలు చెప్పినా మళ్లీ కేసీఆర్ సర్కారే వస్తుందని, రైతులు కూడా అదే కోరుకుంటున్నారని పేర్కొన్నారు.



## ఇందూరుకు చేరుకున్న దాశరథి మైనపు బొమ్మలు

ఖలీల్‌వాడి, జూలై 19: దాశరథి జైలు జీవితం గడిపిన నిజామాబాద్ ఖిల్లాను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కృషి చేస్తున్నారు. ఇందుకోసం రూ.40 లక్షల నిధులు కూడా కేటాయించి నేటి తరానికి దాశరథి జీవిత విశేషాలను తెలియజేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా దాశరథి కృష్ణమాచార్య తదితరుల మైనపు బొమ్మలు బుధవారం ఇందూరుకు చేరుకున్నాయి.

